క్లుప్తంగా

ఇంజినీర్ల దినోత్సవాన్ని విస్మరించడం తగదు

మైనార్టీ హక్కుల పోరాట సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ మహ్మద్ వసీం

యాలాల: నవాబ్ అలీ నవాజ్‌జంగ్ బహదూర్ జయంతి సందర్భంగా ప్రతి ఏటా నిర్వహించే ఇంజినీర్ల దినోత్సవాన్ని కాంగ్రెస్ సర్కారు విస్మరించడం బాధాకరమని స్టేట్ మైనార్టీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మహ్మద్ వసీం పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో నవాబ్ అలీ సేవలను గుర్తించి గౌరవ సూచకంగా జులై 11న ఇంజినీర్ల దినోత్సవంగా ప్రకటించారన్నారు. దీంతో నగరంలోని ఎర్రమంజిల్ జలసౌధలో ఇంజినీర్ల దినోత్సవాన్ని నిర్వహించేవారని గుర్తుచేశారు. నిజాం పాలనలో నవాబ్ అలీ చీఫ్ ఇంజినీర్‌గా నిజాంసాగర్, పోచారం, వైరా, పాలేరు, ఎగువ మానేరు, డిండి, హిమాయత్ సాగర్, ఉస్మాన్‌సాగర్, నాగార్జునసాగర్ మొదలైన ప్రాజెక్టులు ఆయన సేవలకు గుర్తుగా ఉన్నాయన్నారు. కాంగ్రెస్ సర్కారు నవాబ్ అలీ జయంతి పట్ల వ్యవహరించిన తీరును రాష్ట్రంలోని మైనార్టీలు ఖండించాలన్నారు. తెలంగాణ వ్యతిరేకులకు విగ్రహాలు ఏర్పాటు చేస్తున్న సర్కారు, హైదరాబాద్ అభివృద్ధికి విశేష సేవలందించిన వ్యక్తిని మర్చిపోవడం తగదన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న పట్నం మహేందర్‌రెడ్డి

యాలాల: మండల కేంద్రంలో ఇటీవల మృతి చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యుడు నాగారం రాములుగౌడ్ కుటుంబ సభ్యులను శనివారం ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి పరామర్శించారు. రాములుగౌడ్ ప్రజాప్రతినిధిగా గ్రామానికి అందించిన సేవలను ఆయన కొనియాడారు. బాధిత కుటుంబానికి పార్టీ తరఫున అండగా ఉంటామని, అధైర్యపడొద్దని పేర్కొన్నారు. పరామర్శించిన వారిలో మాజీ ఎంపీపీ కరణం పురుషోత్తంరావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సిద్రాల శ్రీనివాస్, నాయకులు కమ్మరి శేఖర్, రాపోలు రాములు, గొల్ల శ్రీనివాస్, కిషన్‌రావు, గౌస్, బషీర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆహ్వాన పత్రిక అందజేత



తిరుపతిరెడ్డికి ఆహ్వాన పత్రిక అందిస్తున్న డీడీఎన్‌ఎస్ రాష్ట్ర నాయకులు

కొడంగల్ రూరల్: ఈ నెల 14, 15, 16వ తేదీలలో హైదరాబాద్‌లోని తుల్జాభవన్ ధర్మశాలలో నిర్వహించనున్న యాగాలకు రావాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జ్ ఎనుముల తిరుపతిరెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేశారు. శనివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ధూప, దీప నైవేద్య అర్చక సంఘం (డీడీఎన్‌ఎస్)రాష్ట్ర అధ్యక్షుడు దౌల్తాబాద్ వాసుదేవ శర్మ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు తిరుపతిరెడ్డికి శాలువా కప్పి సన్మానించారు. తుల్జాభవన్ ధర్మశాలలో నిర్వహించనున్న యాగాలకు హాజరుకావాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో డీడీఎన్‌ఎస్ రాష్ట్ర గౌరవ సలహాదారులు గుదే లక్ష్మీనరసయ్యశర్మ, జిల్లా అధ్యక్షుడు లోకూర్తి జయతీర్థాచారి, కిట్టుస్వామి, దత్తన్న పాల్గొన్నారు.

42 శాతం రిజర్వేషన్ చరిత్రాత్మక నిర్ణయం



దుద్యాల్: రేవంత్‌రెడ్డిని సన్మానిస్తున్న బీసీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు శివకుమార్

దౌల్తాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించడం చరిత్రాత్మక నిర్ణయమని నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రెడ్డిశ్రీనివాస్, యువజన కాంగ్రెస్ నాయకులు నర్సిములు పేర్కొన్నారు. శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్, ఎస్సీ వర్గీకరణపై అసెంబ్లీలో ఆమోదం తెలపడం అభినందనీయమన్నారు.

రిజర్వేషన్ పెంపుపై హర్షం..

దుద్యాల్: బీసీలకు రిజర్వేషన్లు పెంచడంతో సీఎంకి పలువురు కృతజ్ఞతలు తెలిపారు. లగచర్ల గ్రామానికి చెందిన బీసీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు గుండెమోని శివకుమార్ శనివారం సీఎంను మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల సంక్షేమానికి కృషి చేస్తుందని, అందుకు సంకేతమే రిజర్వేషన్ల పెంపు అని సీఎంను కొనియాడారు. సీఎంను కలిసిన వారిలో బీసీ జాతీయ నేత ఆర్ కృష్ణయ్య కూడా ఉన్నారు.

సొంత భవనాలేవి?



దేవర్‌ఫసల్‌వాద్‌లో సంఘం సభ్యురాలి ఇంటి ఆవరణలో సమావేశమైన సంఘం సభ్యులు (ఫైల్)

- కార్యకలాపాల నిర్వహణకు తప్పని తిప్పలు
- ఇబ్బందుల్లో మహిళా సంఘాల సభ్యులు
- పట్టించుకోని అధికారులు

దౌల్తాబాద్: మండలంలోని మహిళా పొదుపు సంఘాలకు సొంత భవనాలు కరువయ్యాయి. కార్యకలాపాలకు ఇబ్బందులు తప్పడంలేదు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో మహిళా స్వయం సహాయక సంఘాల నిర్వహణ కొనసాగుతుంది. స్వశక్తి సంఘాల ఏర్పాటు నుంచి ఇప్పటి వరకు సొంత భవనాలు ఏర్పాటు చేయలేదు. ప్రతి నెలా గ్రామాల్లోని చెట్లు, సంఘం సభ్యుల నివాసాల్లో సమావేశాలు నిర్వహిస్తున్నారు. దీంతో వారు తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నట్లు వాపోతున్నారు.

46 గ్రామైక్య సంఘాలు

మండలంలో 33 గ్రామ పంచాయతీల్లో 46 గ్రామైక్య సంఘాలు ఉన్నాయి. ఇందులో సుమారు 806 స్వయం సహాయక సంఘాలు ఉండగా 9,000 మంది సభ్యులుగా కొనసాగుతున్నారు. స్వయం ఉపాధి కార్యక్రమాల ద్వారా మహిళలు జీవనోపాధి అవకాశాలు పెంపొందించుకుంటూనే పొదుపులో ఆదర్శంగా నిలుస్తున్నారు. గ్రామ స్థాయిలో కార్యాలయాలు లేక మహిళలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ప్రధానంగా బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాల మంజూరు, వసూళ్లు, సభ్యుల్లో చైతన్యం పెంపొందించడంలో కీలకపాత్ర పోషిస్తున్నారు. ఈ క్రమంలో వారికి సరైన వేదికలు అందుబాటులో లేకుండా పోయాయి. ఫలితంగా ప్రభుత్వం ఆశించిన లక్ష్యం నెరవేరడంలేదు.

వెంటాడుతున్న సమస్యలు

సొంత భవనాలు లేక సంఘాల కార్యకలాపాల నిర్వహణతో పాటు మహిళా సమాఖ్య, పొదుపు సంఘాల సమావేశాల నిర్వహణ, శిక్షణలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. గ్రామైక్య సంఘాల వద్దకు వివిధ పనుల కోసం వచ్చిపోయే మహిళా సంఘాల ప్రతినిధులు, సభ్యులకు గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించలేదు. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళా సంఘాల నిర్వహణ కోసం మండల కేంద్రంలో ఇందిరాక్రాంతి పథకం పేరిట సొంత భవనం ఏర్పాటు చేశారు. గ్రామాల్లో సంఘ భవనాలు నిర్మిస్తే సంఘాల నిర్వహణలో తలెత్తే సమస్యలు పరిష్కారమయ్యే అవకాశం ఉంది. సీఎం సొంత నియోజకవర్గం కావడంతో ఈ సారైనా మహిళల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని సొంత భవనాలు నిర్మిస్తారని వారు ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నారు.

> **ఉన్నతాధికారులకు నివేదించాం**
>
> స్వయం సహాయక సంఘాల నిర్వహణ కోసం సొంత భవనాల నిర్మాణాల అవశ్యకత గురించి ఉన్నతాధికారులకు వివరించాం. మండలంలో భవనాలు కావాలని ప్రతిపాదనలు కూడా పంపించాము. అయితే చాలా గ్రామాల్లో సభ్యుల నివాసాల్లోనే కమ్యూనిటీ భవనాల్లో సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ విషయమై ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లాం.
>
> – హరినారాయణ, ఏపీఎం, దౌల్తాబాద్

మౌలిక వసతుల కల్పనకు చర్యలు



విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న నిర్మల

వసతి గృహ సంక్షేమ అధికారి నిర్మల

కొడంగల్: బాలికల వసతి గృహాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని వసతి గృహ సంక్షేమ అధికారి నిర్మల పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని బాలికల వసతి గృహం, కళాశాల వసతి గృహంలో కల్పిస్తున్న సౌకర్యాలపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిర్మల మాట్లాడుతూ హాస్టల్‌లో మెనూ, ఇతర వస్తువుల గురించి వివరించారు. ప్రభుత్వం కల్పిస్తున్న ప్రతీ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం తల్లిదండ్రులు అడిగిన ప్రశ్నలకు, సందేహాలకు హాస్టల్ నిర్వాహకులు నివృతి చేశారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లోనే మెరుగైన విద్యాబోధన చేస్తున్నారని తెలిపారు.

సంస్మరణ సభను విజయవంతం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కేఎన్‌పీఎస్ నాయకులు



బొంరాస్‌పేట: నినాదాలు చేస్తున్న కేఎన్‌పీఎస్ నాయకులు

కొడంగల్ రూరల్: ఈ నెల 17వ తేదీన తాండూరు పట్టణంలో నిర్వహించనున్న దళిత మృతవీరుల సంస్మరణ సభను విజయవంతం చేయాలని కుల నిర్మూలన పోరాట సమితి మండల అధ్యక్షుడు అంజి పేర్కొన్నారు. శనివారం పట్టణంలో సభకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కారంచేడు నుంచి చుండూరు వరకు దళిత వీరమరణాలను స్మరించుకోవాలన్నారు. వారి త్యాగ ఫలాన్ని వృథా కానివ్వమనే నినాదాలతో సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కేఎన్‌పీఎస్ సభ్యులు వెంకటయ్య, ఆనంద్, భాస్కర్, రవి తేజ తదితరులు పాల్గొన్నారు.

మృతవీరుల సంస్మరణ సభకు తరలాలి

బొంరాస్‌పేట: రాష్ట్రం కోసం పోరాడి ప్రాణాలర్పించిన దళిత మృతవీరుల సంస్మరణ సభకు తరలి రావాలని కుల నిర్మూలన పోరాట సమితి (కేఎన్‌పీఎస్) మండల అధ్యక్షుడు మ్యాతరి అంజిలప్ప పిలుపునిచ్చారు. శనివారం మండల పరిధిలోని కొత్తూరులో మహనీయుల విగ్రహాల వద్ద సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దళిత అమర వీరుల ప్రాణత్యాగాలను స్మరించుకునేందుకు, వారి స్ఫూర్తిలో కొనసాగేందుకు సంస్మరణ సభను ఈ నెల 17న నిర్వహిస్తున్నామన్నారు. దీనికి ప్రతిఒక్కరూ హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు బలరాం, ప్రధాన కార్యదర్శి అంజి, సహాయ కార్యదర్శి శ్రీను, మాజీ సర్పంచు మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంక్షేమానికి కృషి


కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శేఖర్



సమావేశంలో మాట్లాడుతున్న శేఖర్

దుద్యాల్: మహిళా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని మండల అధ్యక్షుడు ఆవుటి శేఖర్ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని లగచర్ల గ్రామంలో ఏర్పాటు చేసిన ఇందిర మహిళా శక్తి సంబురాల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం మహిళలకు అన్ని రంగాల్లో అవకాశాలు కల్పిస్తూ, కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పెట్టుకుందన్నారు. కలిసికట్టుగా ముందుకు వస్తే పెట్రోల్ బంక్, ఆర్టీసీ బస్సు, మిని రైస్‌మిల్‌ను మహిళ సంఘాలకు అప్పగించేందుకు సంబంధిత అధికారులు కూడా సిద్ధంగా ఉన్నారని గుర్తుచేశారు. గ్రామాల్లో సోలార్ ప్లాంట్‌లు ఏర్పాటుకు అవకాశం ఉందన్నారు. ఫుడ్ ప్రిపరేషన్ వాహనాలు కూడా అందుబాటులో ఉన్నట్లు వివరించారు. వీటన్నింటిని మహిళలు మాత్రమే వినియోగించుకునే అవకాశం ఉందని, అందుకు గాను ముందుకు రావాలని సూచనలు చేశారు. కొడంగల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకారం వేణుగోపాల్, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేరుగు వెంకటయ్యలు మాట్లాడుతూ అవకాశాలను మహిళలు అందిపుచ్చుకోవాలన్నారు. ఏపీఎం సాయిలు, సీసీ సంజీవ్, కృష్ణ, యాదిరెడ్డి, లగచర్ల మహిళా సంఘం గ్రామ అధ్యక్షురాలు అంజిలమ్మ, లక్ష్మీ పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నేతలు

కుల్కచర్ల: అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి పేర్కొన్నారు. శనివారం కుల్కచర్ల మండలం పుట్టపహాడ్ గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలకు ఇళ్లు మంజూరు చేసిన ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుందన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు, మాజీ మండల అధ్యక్షుడు పెంటమీది వెంకటయ్య, మండల ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, ఉపాధ్యక్షుడు హరినాథ్ రెడ్డి పాల్గొన్నారు.

పేద కుటుంబాలకు అండగా ఉంటా

దోమ: గ్రామంలో పేద కుటుంబాలకు అండగా ఉంటామని బీజేపీ గ్రామ అధ్యక్షుడు మల్లేశ్‌యాదవ్ పేర్కొన్నారు. శనివారం బొంపల్లి గ్రామంలో గ్రామానికి చెందిన రాఘుల శివమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న బీజేపీ నాయకులు మృతదేహానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం అంత్యక్రియల నిమిత్తం ఆర్థిక సహాయం అందజేశారు. గ్రామంలోని ముదిరాజ్ యువకులు రూ.6వేలు సాయం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు బోయిని నరేశ్‌ముదిరాజ్, ముద్దం నర్సింహాయాదవ్, మల్లేశ్ యాదవ్, శ్రీనివాస్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

చిత్ర కళారంగంలో ప్రశంసా పత్రం అందజేత

దౌల్తాబాద్: మండలంలోని యాంకి గ్రామానికి చెందిన సున్నపు అశోక్‌కు ప్రశంసా పత్రం అందజేశారు. చిత్ర కళారంగంలో రాణిస్తున్నందున గురుపౌర్ణమి సందర్భంగా ఆన్‌లైన్ వేదికగా న్యూఢిల్లీకి చెందిన భారతీయ రాష్ట్రీయ వికాస్ సంస్థ, అఖిలభారత సామాజిక సామరస్య ఫౌండేషన్ వారు అందజేశారు. ఈ సందర్భంగా సామాజిక న్యాయానికి ద్రౌపది ముర్ము అధ్యక్ష గౌరవం, నరేంద్ర మోదీ జాతీయ ఐక్యత అనే రెండు ప్రశంసా పత్రాలను అందుకున్నట్లు ఆయన తెలిపారు.

ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి



ఫార్మర్ రిజిస్ట్రేషన్ నిర్వహిస్తున్న రేణుక

దుద్యాల్: ప్రతీరైతు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఏఈవో రేణుక సూచించారు. కొన్ని గ్రామాల్లో ఈ ప్రక్రియను ఉద్యమంలా నిర్వహిస్తున్నామని ఆమె పేర్కొన్నారు. భూమి కలిగిన ప్రతీ రైతు గ్రామాల్లోని వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించాలన్నారు. భవిష్యత్‌లో కేంద్ర ప్రభుత్వం అందజేయనున్న పథకాల్లో లబ్ధి చేకూరాలంటే ఈ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా ఉండాలన్నారు. ఆధార్ కార్డు మాదిరిగా రైతుకు యూనిక్ కోడ్ కలిగిన రిజిస్ట్రేషన్ కార్డును ఇస్తారన్నారు.

సీఎం సహాయనిధి పేదల పెన్నిధి



కుల్కచర్ల: చెక్కులు అందజేస్తున్న నాయకులు

- వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి నర్సింలు యాదవ్

కుల్కచర్ల: సీఎం సహాయనిధి పేదల పెన్నిధి అని కుల్కచర్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి నర్సింలు యాదవ్ పేర్కొన్నారు. శనివారం రాంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన అంబాబాయికి రూ.40వేలు, కుమ్మరి స్వాతికి రూ.58వేలు మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..పేదల ఆరోగ్యం దృష్ట్యా ప్రైవేట్ ఆస్పత్రుల్లో మెరుగైన చికిత్స చేయించుకోవడానికి ఈ నిధి ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆనమోని నర్సింలు, లక్ష్మయ్య, శ్రీనివాస్ రెడ్డి, బుగ్గయ్య, ఎల్లయ్య, కృష్ణయ్య, రమేశ్, ఆంజనేయులు, మహేశ్, యాదయ్య, షర్ఫొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వరం..



పూడూరు: బాధిత కుటుంబికులకు ఎల్‌ఓసి అందజేస్తున్న నాయకులు

పూడూరు: నిరుపేద కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ వరం లాంటిదని పీఏసీఎస్ చైర్మన్ పట్లోళ్ల సతీష్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన పలువురు అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెల్సుకున్న పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు శనివారం మన్నేగుడలో బాధిత కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందచేశారు. ఈ కార్యక్రమంలో డిసిసి కార్యదర్శులు పెంటయ్య, శ్రీనివాస్‌రెడ్డి, అజీమ్‌పటేల్, మండల పార్టీ అధ్యక్షుడు సురేందర్, నాయకులు శ్యాంసుందర్‌రెడ్డి, నారాయణ, వీరేష్, శ్యాం కుమార్, భీమయ్య, అరీఫ్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అంటేనే పేదల పార్టీ



కిష్టంపల్లి గ్రామంలో ఎన్నికైన నూతన కార్యవర్గం

కుల్కచర్ల: కాంగ్రెస్ అంటేనే పేదల పార్టీ అని మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్లు రామ్మోహన్ శర్మ, నాగరాజు, చౌడాపూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అశోక్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం కిష్టంపల్లి గ్రామంలో నూతన గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాటాడుతూ..పేద ప్రజల అభ్యున్నతికి కృషి చేసే ఏకైక పార్టీ కాంగ్రెస్సేనని పేర్కొన్నారు. నాటి నుంచి నేటి వరకు పేదల కోసమే పార్టీ పనిచేస్తుందన్నారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా మురుగని ఆంజనేయులు, యూత్ వింగ్ అధ్యక్షుడిగా దశరత్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు అమర్నాథ్ రెడ్డి, నర్సింహ నాయక్, మండల ప్రధాన కార్యదర్శి దామోదర్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటయ్య గౌడ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు చెన్నయ్య, ఎస్టీ సెల్ అధ్యక్షుడు గోపాల్, మండల యువజన విభాగం అధ్యక్షుడు రాము తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి



ముఖ్యమంత్రిని కలిసిన నియోజకవర్గ నాయకులు

దౌల్తాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల్లో యువజన కాంగ్రెస్ నాయకులు సైనికుల్లా పనిచేసి సత్తాచాటాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. శనివారం నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో యువజన కాంగ్రెస్ నాయకులు హైదరాబాద్‌లో ముఖ్యమంత్రిని కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. నియోజకవర్గంలో ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. రానున్న పంచాయతీ, పరిషత్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురువేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నరేశ్, మహిపాల్, అమర్నాథ్, షఫీ, రమేష్‌నాయక్, గోపాల్, శ్రీను, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు తీసుకోవాలి



గౌతపూర్‌లో తల్లులకు అవగాహన కల్పిస్తున్న ఏఎన్‌ఎం పుష్ప

తాండూరు రూరల్: ప్రతిఒక్కరూ సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు తీసుకోవాలని జినుగుర్తి పీహెచ్‌సీ ఏఎన్ఎం పుష్ప పేర్కొన్నారు. శనివారం తాండూరు మండలం గౌతపూర్ గ్రామంలో ఆమె మాట్లాడుతూ..గర్భిణులు వైద్య ఆరోగ్యశాఖ అధికారుల సూచనలు పాటించాలన్నారు. బాలింతలు కూడా తమ పిల్లలకు నెలవారి టీకాలు తప్పకుండా వేయించాలన్నారు. పుట్టిన తల్లులు తల్లిపాలు తాపించాలన్నారు. తల్లిపాలతో పిల్లలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఆశవర్కర్, గర్భిణులు, తల్లులు తదితరులు పాల్గొన్నారు.

పొలాల్లో ఒరిగిన స్తంభాలు

- ప్రమాదకరంగా విద్యుత్ పోల్స్
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులు
- సరిచేయాలని వేడుకోలు
- పట్టించుకోని ట్రాన్స్‌కో సిబ్బంది



నాగసమందర్ విద్యుత్ లైన్‌లో ఓ పొలంలో ఒరిగిన విద్యుత్ స్తంభం

ధారూరు: వరి నాట్లు వేసే సమయం ఆసన్నమైంది. అందుకుతగ్గట్టుగా రైతులు సిద్ధం చేసుకుంటున్నారు. కానీ అల్లాపూర్ గ్రామంలోని పొలాల్లో విద్యుత్ స్తంభాలు ఒరిగిపోయి ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. సుమారు 50 మంది ఈ సమస్య ఎదుర్కొంటున్నారు. ఈ విషయం గురించి ధారూరు మండల ట్రాన్స్‌కో ఏఈ వేణుగోపాల్‌రెడ్డికి పలుమార్లు మొరపెట్టుకున్నా ఫలితం శూన్యం. ఈ విషయాన్ని పట్టించుకునే అధికారులు కరువయ్యారు. అంతేకాక అక్కడ పొలాల్లో విద్యుత్ పోల్స్ ప్రమాదకరంగా తయారైనా తమకేమి పట్టనట్లు వ్యవహరించడం బాధాకరమని చెబుతున్నారు. బూర్గుగడ్డ ప్రాంతంలో సుమారు 80 ఎకరాలు ఉన్నాయి. ఖరీఫ్‌లో వరి నాట్లు వేయాల్సి ఉందని చెబుతున్నప్పటికీ ఆవైపు వచ్చి చూసిన వారే లేరు.

భయం..భయంగా..

రెండు నెలల క్రితం ఫిర్యాదు చేస్తే రెండు రోజుల్లో సరిచేయిస్తానని చెప్పి నేటికీ మరమ్మతులు చేసిన నాథుడే లేరు. బూర్గుగడ్డ పొలాల్లో మధ్య మధ్యలో నాలుగు స్తంభాలు ఒరిగి ఉన్నాయి. వ్యవసాయ పనుల నిమిత్తం పొలంలో పనిచేసే క్రమంలో ఎప్పుడు ఏమౌతుందోనని భయం..భయంగా పనులు చేయాల్సి వస్తోందనని వాపోయారు. పొలాలకు నీరు పారించి కరిగెడ చేస్తే నీటితో నిండి స్తంభాలు పడిపోయే అవకాశమెక్కువ. ఆ సమయంలో విద్యుత్ సరఫరా కొనసాగుతుంటే పొలాల్లోనే తమ ప్రాణాలు గాలిలో కలిసిపోతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నారు పెరిగే లోపే సరిచేయాలి

ప్రస్తుతం ఖరీఫ్‌లో వరినారు వేస్తున్నామని, నారు పెరిగే లోపే స్తంభాలను సరిచేయించాలని వారు కోరుతున్నారు. గతంలో పొలంలో పనిచేస్తున్న ఓ రైతు సమీపంలో స్తంభం పూర్తిగా ఒరిగిపోయింది. ఈ ప్రమాదాన్ని పసిగట్టి ప్రాణాలు కాపాడుకున్నారని వారు గుర్తు చేశారు. స్థానిక లైన్‌మెన్ వెంకట్‌రాములుకు చెబితే ఏఈతో చెప్పాలని దాటవేస్తున్నాడు. ఏఈ మాత్రం రెండు రోజులు ఆగలంటూ జాప్యం చేస్తున్నారే తప్ప మరమ్మతులు మాత్రం చేపట్టడం లేదు. నాగసమందర్ వద్ద ఒకటి, బూర్గుగడ్డ ప్రాంతంలో నాలుగు ఒరిగిపోయాయని వారు తెలిపారు. స్థానిక శాసనసభ్యులు, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ఈ విషయంలో తగిన చొరవ తీసుకుని యుద్ధప్రాతిపదికన విద్యుత్ లైన్ సరిచేయించాలని కోరుతున్నారు.